శిథిలావస్థలో హరిత నిధి నర్సరీ

- జిల్లాలో మోడల్ నర్సరీగా పోచంపాడ్‌లో ఏర్పాటు
- వృథాగా రూ.1.50 లక్షలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం


శిథిలమైన పోచంపాడ్ హరిత నిధి నర్సరీ

బాల్కొండ : హరితహారం పథకంలో భాగంగా పచ్చదనం పెంచుట కోసం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన హరిత నిధి నర్సరీ శిథిలావస్థకు చేరుకుంది. జిల్లాలో మోడల్ నర్సరీగా మెండోరా మండలం పోచంపాడ్‌లోని ఫారెస్ట్ నర్సరీ ఆవరణలో ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి సేకరించిన నిధులతో పాటు ప్రభుత్వం రూ.1.50 లక్షలతో హరిత నిధి నర్సరీని ఏర్పాటు చేసింది. ఈ నర్సరీలో నాణ్యమైన మొక్కలను పెంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. నర్సరీలో పాలీహౌజ్ ఏర్పాటు చేసి ట్రేలలో మొక్కల పెంపకం చేపట్టారు. ప్రధానంగా నారు పెంచుటకు ఈ నర్సరీని వినియోగించారు. అనంతరం అధికారులు పట్టించుకోక పోవడంతో మోడల్ నర్సరీ షెడ్డు ఎందుకు పనికి రాకుండా పోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన నర్సరీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోడల్ నర్సరీ నిర్వహణను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిధులు రావడం లేదు

హరిత నిధి ద్వారా మంజూరైన మోడల్ నర్సరీ నిర్వహణ కోసం ఎలాంటి నిధులు రావడం లేదు. ఒక్క సంవత్సరం నిధులు మంజూరు కావడంతో మొక్కల పెంపకం చేపట్టాం. తరువాత ఏడాది నుంచి నిధులు రావడం లేదు.

– గణేశ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, మెండోరా

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి


మంథనిలో మాట్లాడుతున్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి రసూల్ బీ


వేల్పూర్‌లో బాలింతకు న్యూట్రిషన్ కిట్ అందిస్తున్న అధికారులు


పోతంగల్‌లో మాట్లాడుతున్న బోధన్ సీడీపీవో పద్మ

పెర్కిట్(ఆర్మూర్): ఆరోగ్యంగా ఉండడానికి బాలింతలు, గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ సూచించారు. ఆర్మూర్ మండలం మంథనిలో మంగళవారం పోషణ మాస పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ బీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో శివాజీ, సీడీపీవో భార్గవి, అంగన్‌వా డీ టీచర్లు చంద్రకళ, ఐకేపీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలి

రుద్రూర్ : మహిళలు పౌష్టికాహారంపై తీసుకోవాలని బోధన్ సీడీపీవో పద్మ అన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీవో మాట్లాడారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని తప్పని సరిగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చందర్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కోమరవ్వ , శ్రీలత, వెంకట రమణ, గోపి లక్ష్మీ, హెల్త్ సూపర్ వైజర్లు జ్యోతి, సావిత్రి, సునీత, యోగా టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐసీడీఎస్ అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని వేల్పూర్ ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు వేల్పూర్ జీపీలో నిర్వహించిన మండలస్థాయి అంగన్‌వాడీ పోషణమాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అధికారి బాలింతకు న్యూట్రిషన్ కిట్ అందించారు. పిల్లలకు ముర్రుపాల ప్రాముఖ్యతను మండల సూపర్‌వైజర్ ఉషారాణి వివరించారు. తల్లులకు వ్యాసరచన, ఆటలపోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు వసంత, వీణ, శ్రావణ్య, పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో పొలంబాట


పొలంబాటలో పాల్గొన్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం చేపట్టారు. నిజామాబాద్ ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ అల్జాపూర్ రమేశ్ పొలంబాట కార్యక్రమానికి హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సిబ్బంది సరి చేశారు. అలాగే వంగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెర్కిట్ ఏఈలు శ్రీనివాస్, మౌనిక, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు పాల్గొన్నారు.

ముల్లంగి (బి)లో బోనాల పండుగ


ముల్లంగి (బి) గ్రామంలో బోనాలతో మహిళలు


కుమ్మన్‌పల్లిలో..

మాక్లూర్: మండలంలోని ముల్లంగి (బి) గ్రామంలో మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లపాప చల్లంగా చూడాలని కోరుతూ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.గ్రామంలో అన్నికులాలకు చెందిన వారు ఇంటికో బోనంతో గ్రామ దేవతల ఆలయాలకు తరలివెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుమ్మన్‌పల్లిలో..

బోధన్: సాలూర మండలం కుమ్మన్‌పల్లిలో మంగళవారం ఆనవాయితీగా ఊర పోచమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. బోనాలుతో మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు తోకల అంజయ్య, కుమ్మరి పోశెట్టి, నరేష్ రెడ్డి,సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచ్ అడ్డకట్ల గంగాధర్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్,కాశీరెడ్డి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



వర్ని (మోస్రా): గ్రామాల్లో చెత్తాచెదారం ఉండకుండా రోడ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బోధన్ డీఎల్పీవో సాయిబాబా సూచించారు. మంగళవారం మోస్రాలో ఆయన డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ లో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలన్నారు. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడ పరిశుభ్రత లోపించకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కు సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- బోధన్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్) : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో బోధన్ పట్టణ, మండలానికి చెందిన 245 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులను సరిదిద్దేందుకు సమయం పడుతున్నా ముందుకు సాగుతున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీని నిర్లక్ష్యం చేసి మూసి వేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నైతిక విలువలు పాటించి ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమం దిశగా పని చేయని అధికారులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రజలను దోచుకోవడం ఎక్కువైందని అటువంటి ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడుతామని, అవసరమైతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. వర్షం పడితే బోధన్ మున్సిపల్ కార్యాలయం ఊరుస్తుందని, నూతన భవనం నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, కమిషనర్ జాదవ్ కృష్ణ, ఏసీపీ శ్రీనివాస్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నిర్ణేతలు

- కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్
- బోధన్‌లో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నాయకుల సమావేశం



బోధన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికి అధికారం ఇవ్వాలనే విషయంలో ప్రజలే తుది నిర్ణేతలని కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ అర్షద్ అన్నారు. తమకు నచ్చని పార్టీలను ప్రజలు ఇంటికి పంపిస్తారని,త్వరలోనే బీజేపీకి ఇంటికిపోయే రోజులు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. డీసీసీ పదవి నియమాకం నేపథ్యంలో సంఘటన శ్రీజన అభియాన్‌లో భాగంగా బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో బోధన్ నియోజక వర్గంలోని ఏ,బీ బ్లాక్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. నాయకులు అభిప్రాయాలను సేకరించారు.ఈ సందర్భంగా రిజ్వాన్ అర్షద్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన అర్షద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 ఏళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌కు ఇంటికి పంపించి కాంగ్రెస్ పార్టీ ప్రజలు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేసేందుకు కృషిలో భాగంగానే డీసీసీ పదవి నియమాకంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. ప్రజల మధ్య ఉంటూ పార్టీ కోసం పని చేసే నాయకులకే పదవి దక్కుతుందన్నారు. నాయకులు ,కార్యకర్తల అభిప్రాయాల నివేదికను పార్టీ అధిష్టానానికి పంపిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు,డీసీసీల పదవుల నియమాకానికి ఏఐసీసీ సరికొత్త విధానానికి శ్రీకారంచుట్టిందన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రమేష్ రెడ్డి,టీపీసీసీ డెలిగెట్ గంగాశంకర్,నాయకులు అరెపల్లి మోహన్, రవిబాబు, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆర్మూ ర్ బాలుర పాఠశాలలో మంగళవారం 69వ ఆర్మూ ర్ అర్బన్ మండల స్థాయి అంతర పాఠశాలల వా లీబాల్, ఖోఖో కబడ్డీ అండర్–14,17 బాల బాలికల క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఉత్సవాల్లో ఏసీపీ పాల్గొని మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడ ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం క్రీడకారులను పరిచ యం చేసుకొని ఖోఖో, వాలీబాల్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారం, ఆర్గనైజింగ్ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య, సెక్రటరీ మల్లేష్‌గౌడ్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్‌వీ హన్మంత్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు, టీచర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు


బాల్కొండలో క్యూఆర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న షీ టీం

బాల్కొండ: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీం డివిజన్ కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతిలు అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని శాంభవి పాఠశాలలో విద్యార్థులకు షీ టీం విధులపై అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే షీ టీంకు సమాచార మందించాలన్నారు. అందుకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రూర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోటగిరి, రుద్రూర్ ఎస్సైలు సునీల్, సాయన్న సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రుద్రూర్ మండలంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి శ్రీనిత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రాజేశ్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన అండర్–14 ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీనిత్ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 16 నుంచి నిర్వహించే సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన శ్రీనిత్‌ను ఆలూర్ ఎంఈవో మేస నరేందర్, పీడీ గటడి రాజేశ్ అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

సీపీఆర్‌పై అవగాహన

బోధన్: ప్రతి ఒక్కరికి సీపీఆర్ ప్రక్రియ పై అవగాహన కలిగి ఉండాలని ఎడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వినీత్ రెడ్డి సూచించారు. మంగళవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎడపల్లి జెడ్పీహెచ్‌ఎస్ లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు సీపీఆర్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆకస్మికంగా గుండెపోటుకు గురైన వ్యక్తులకు సీపీఆర్ చేస్తే ప్రాణపాయం తప్పుతుందన్నారు.

పాదయాత్ర కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా,పట్టణ ప్రతినిధులు

బోధన్ : పట్టణంలో వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వీఆర్ దేశాయ్, ప్రతినిధులు కపిలధార మన్మథస్వామి పాదయాత్ర కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రాంతం బీడ్ జిల్లాలోని మాంజర్ సుంభా గ్రామ శివారులోని శ్రీ క్షేత్ర కపిలధార మన్మథస్వామి మహరాజ్ శైవ క్షేత్రానికి వీరశైవులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లి కార్తీక పౌర్ణమి రోజు అక్కడికి చేరుకుని దర్శనం చేసుకుని తిరిగిపయనమవుతారని పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని జంగమ సమాజ్ గల్లీలో గల పురాణే మఠం సౌజన్యంతో వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ బోధన్ శాఖల ఆధ్వర్యంలో ఈసారి 16 వ పాదయాత్ర కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 23న పురాణే మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించినంతరం స్థానిక పురాతన చారిత్రిక ఏకచక్రేశ్వరాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 5న మన్మథస్వామి క్షేత్రానికి చేరుకుంటుందని వెల్లడించారు.కపిలధార జలపాతంలో పుణ్య స్నానాలు ఆచరించి దైవ దర్శనంతో పాదయాత్ర ముగిస్తోందన్నారు. వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ పట్టణ అధ్యక్షులు నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్,ప్రతినిధులు పురాణే అజయ్‌కుమార్, రాజేందర్, శంకర్‌అప్ప, ప్రభు అప్ప, పురాణే దిలిప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రంగా ఎంతో అవసరమన్నారు. వైద్యాధికారి రాకేశ్, ప్రిన్సిపాల్ గోదావరి, వైద్యా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి


మక్కలను పరిశీలిస్తున్న నూతుల శ్రీనివాస్

బాల్కొండ : ప్రభుత్వం వెంటనే మక్కల, సోయాల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీజేపీ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బాల్కొండలో రైతులు రోడ్లపై ఆరబెట్టిన మక్కలు, సోయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గత మూడు రోజులుగా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులను అడిగితే ఇప్పటి వరకు ఎలాంటి జీవో రాలేదని మండిపడ్డారు. దళారులకు, వ్యాపారులకు రైతులు అమ్ముకున్న తరువాత ఏర్పాటు చేస్తారా అని మండిపడ్డారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఆరేపల్లి సాయిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి



బోధన్ : భూమి సారాన్ని కాపాడుకోవాలని కోరమండల్ సంస్థ ప్రతినిధులు అన్నారు. పంటల సాగుకు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని రైతులకు సూచించారు.మంగళవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో కోరమండల్ సంస్థ ఆధ్వర్యంలో గ్రోమోర్ గ్రామోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్, తహసీల్దార్ దత్తాద్రి , సంస్థ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కోరమండల్ సంస్థ జోనల్ మేనేజర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ జానకంపేట గ్రామాన్ని దత్తత తీసుకోవాలని నిర్ణయించామని వెల్లడించారు. ఇందులో భాగంగా రైతులకు సాంకేతికపరమైన పరికరాలు అందిస్తామన్నారు. జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జోన్స్, సంస్థ ప్రతినిధులు పాపిరెడ్డి,రమేష్, వంశీ, పురం అబ్బయ్య, సొసైటీ వైస్ చైర్మన్ ఒడ్డెన్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాద బాధిత కుటుంబాలకు వీడీసీ చేయూత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన కొండపల్లి లక్ష్మణ్, చిత్తారి నర్సింలు కుటుంబ సభ్యులకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ చేయూత అందించింది. మంగళవారం వీడీసీ సభ్యులు వారింటికి వెళ్లి 50 కిలోల బియ్యం, 5 కిలోల పప్పు, 5 కిలోల నూనె చొప్పున ఒక్కో కుటుంబానికి అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, కోశాధికారి బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

వర్ని: మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిడి పుల్లయ్య మంగళవారం మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్ నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయకులు భారీ, బాలరాజు ,శేఖర్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో మామిడిపల్లిలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ ఆధ్వర్యంలో మహిళ షేక్ రేష్మకు కుట్టుమిషన్ అందజేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆకుల రాజు, ప్రధానకార్యదర్శి శీను, కోశాధికారి గోపి కృష్ణ, ఆర్మూర్ గ్రీన్ ప్రతినిధులు అల్జాపూర్ రాజేష్, బారడ్ బాలాజీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్ : తెలంగాణ సర్వశిక్షాభియాన్ సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీ శిక్షణను వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపి శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సను అందించారు. ఈ శిబిరంలో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ కిషన్, సురేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రుద్రూర్ : మండలంలో బుధవారం వచ్చే నెల 14వ తేదీ వరకు వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్టు మండల అధికారి సంతోష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరాలను పాడిరైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం మెడికవర్ హాస్పిటల్, హెచ్‌డీఎఫ్‌సీ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో డాక్టర్ ఆశిష్ రోగులను పరీక్షించి, అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, హెచ్‌డీఎఫ్‌సీ ఈర్గో మేనేజర్ రాజగంభీర్, అసిస్టెంట్ మేనేజర్ సదాశివ్, సీనియర్ అడ్వయిజర్ కొమ్ముల శ్రీనివాస్, పెంబర్తి నరేష్, జీపీ కార్యదర్శి గంగాజమున తదితరులు పాల్గొన్నారు.

వివిధ మోర్చాల అధ్యక్షుల నియామకం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా ఉదయ్‌గౌడ్, దళిత మోర్చా అధ్యక్షుడిగా గుండెటి రాజశేఖర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా శేషగిరి లింగంలను నియమించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, జిల్లా ఉపాధ్యక్షుడు పాలెపు రాజు, జిల్లా కార్యదర్శి పొల్కం వేణు, జీవీ నర్సింహారెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా నూతన అధ్యక్షులు నియామక పత్రాలు అందుకున్నారు. అనంతరం మందుల బాలు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కృషిచేయాలని కోరారు. బీజేపీ నాయకులు ఆకుల శీను, జెస్సు అనిల్, కలిగొట గంగాధర్, బద్రి, ఆకుల రాజు పాల్గొన్నారు.